# నమస్తే తెలంగాణ

# మహబూబాబాద్

5 | గురువారం 25 జూలై 2024 | MAHABUBABAD


• ఆడబిడ్డల ఆనందహేల



కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా జనగామలో కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన మహిళలు

# రామన్నకు ప్రేమతో..

**పండుగలా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు వేడుక**

*బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజును బుధవారం బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు, అభిమానులు ఘనంగా జరుపుకొన్నారు. రామన్నపై ప్రేమతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేక్ కటింగ్‌లు, ఆలయాల్లో పూజలు, రక్తదానాలు, దవాఖానల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్లు, చిరువ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. అలాగే మొక్కలు నాటి 'లాంగ్ లివ్.. కేటీఆర్ సార్ హ్యాపీ బర్త్‌డే' అంటూ పెద్ద పెట్టున నినాదాలతో శుభాకాంక్షలు తెలిపారు. జనగామలో పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రాజయ్య పాల్గొని ఆడబిడ్డలకు వెయ్యి కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భారీ కేక్ కట్ చేయడంతో పాటు రక్తదానం చేసి, వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. అలాగే ములుగులో జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, బయ్యారంలో జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు పాల్గొనగా పలువురు నేతలు హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి బర్త్‌డే విషెస్ చెప్పారు.*

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూలై 24*

ఉమ్మడి జిల్లా అంతటా ఘనంగా జరుపుకొన్న బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు

- కేక్ కటింగ్‌లు, రక్తదానాలు, దవాఖానల్లో రోగులకు పండ్లు, గొడుగుల పంపిణీ
- జనగామలో పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెయ్యి కుట్టుమిషన్ల పంపిణీ
- హనుమకొండలో మొక్కలు నాటిన నాయకులు
- పాల్గొన్న ఎమ్మెల్సీ పోచంపల్లి, మాజీ మంత్రి ఎర్రబెల్లి, దాస్యం వినయ్‌భాస్కర్
- లాంగ్ లివ్ కేటీఆర్ సర్ అంటూ వెల్లువెత్తిన శుభాకాంక్షలు

• హ్యాపీ బర్త్‌డే సర్..



హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

# భవిష్యత్ తరాలకు ఆశాకిరణం కేటీఆర్

**ఐటీ, పారిశ్రామిక రంగాల్లో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపిన నేత**

- ప్రతిపక్షంలోనూ ప్రజల పక్షాన పోరాడుతున్న యోధుడు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు, రక్తదానం, చిరు వ్యాపారులకు గొడుగులు

హనుమకొండ చౌరస్తా, జూలై 24: తెలంగాణ భవిష్యత్ తరాలకు మాజీ మంత్రి, కేటీఆర్ ఆశాకిరణం అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బుధవారం కేటీఆర్ జన్మదినం సందర్భంగా పార్టీ ఆఫీస్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. భద్రకాళీ, హనుమాన్, సాయిబాబా, గణపతి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం ధార్మిక భవనంలోని వేద పాఠశాల విద్యార్థులకు వేద గ్రంథాలు, వస్త్రాలను అందజేశారు.

**బీఆర్ఎస్ ఆఫీస్‌లో రక్తదానం, కేక్ కటింగ్..**

బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పార్టీ శ్రేణులు పెద్దఎత్తున రక్తదానం చేశారు. ఈ సందర్భంగా దాస్యం మాట్లాడుతూ.. విజన్ కలిగిన నవ యువనాయకుడు కేటీఆర్ అని, తెలంగాణను ఐటీ, పారిశ్రామిక రంగాల్లో దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపిన నేత అని కొనియాడారు. ప్రతిపక్షంలోనూ ప్రజల పక్షాన పోరాడుతున్న యోధుడు అని పేర్కొన్నారు. అనంతరం కేక్‌ను పార్టీ శ్రేణుల సమక్షంలో కట్ చేశారు. ఆఫీస్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం అదాలత్‌లోని మదర్సాలలో విద్యార్థులకు పండ్లు, బ్రెడ్, బిస్కెట్లు పంపిణీ చేశారు.

**'గిఫ్ట్ ఏ స్మైల్'లో చిరు వ్యాపారులకు గొడుగులు..**

హనుమకొండ చౌరస్తా/సుబేదారి/బాలసముద్రం, అదాలత్ ప్రాంతాల్లో రోడ్ల వెంట ఉన్న చిరు వ్యాపారులకు దాస్యం గొడుగులను అందజేశారు. కార్యక్రమంలో టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, పశ్చిమ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సంకు నర్సింగ్, సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్లు దాస్యం విజయ్‌భాస్కర్, జోరిక రమేశ్, మహ్మద్ సిరాజుద్దీన్, మేకల బాబురావు, కుసుమ లక్ష్మీనారాయణ, తండమల్ల వేణు, మాజీ ఎంపీపీ రఘు, నాయకులు నరెడ్ల శ్రీధర్, సల్వాజీ రవీందర్‌రావు, బుద్దె వెంకన్న, రామ్మూర్తి, నయీముద్దీన్ పాల్గొన్నారు.

**కేటీఆర్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా నేతలు**

మహబూబాబాద్ రూరల్/కృష్ణకాలనీ/పరకాల: కేటీఆర్‌ను ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని కేటీఆర్ నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



హైదరాబాద్‌లో కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీలు సత్యవతి, తక్కళ్లపల్లి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా, గండ్ర



భూపాలపల్లిలో కేటీఆర్ ఫ్లెక్సీకి కేక్ తినిపిస్తున్న బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులు




జనగామలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**స్వావలంబన కోసమే కుట్టుశిక్షణ**

- పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెయ్యి మంది మహిళలకు కుట్టుమిషన్లు
- పంపిణీ చేసిన ఎమ్మెల్సీ పోచంపల్లి పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే రాజయ్య, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి
- జనగామలో భారీ కేక్ కట్‌చేసి కేటీఆర్ జన్మదిన వేడుకలు

జనగామ, జూలై 24(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బర్త్‌డే సందర్భంగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి సొంత ఖర్చుతో జనగామ జిల్లా లింగాలఘనపురానికి చెందిన మహిళలకు వెయ్యి కుట్టుమిషన్లు 'కానుక'గా అందించారు. బుధవారం జనగామ శివారులోని యశ్వంతాపూర్ సత్యసాయి కన్వెన్షన్‌లో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తన ఫౌండేషన్ ద్వారా దాదాపు రూ.2 కోట్లు సొంత ఖర్చుతో మహిళలకు 45 రోజులు ప్రత్యేక శిక్షణ అనంతరం వెయ్యి కుట్టుమిషన్లను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, రాష్ట్ర దివ్యాంగుల సంస్థ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డితో కలిసి పండుగ వాతావరణంలో పంపిణీ చేశారు. కుట్టుమిషన్లు అందుకుంటున్న వేలాది మంది లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల కేరింతల నడుమ సభా వేదికపై భారీ కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. లాంగ్ లివ్.. కేటీఆర్.. అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో లింగాలఘనపురం మాజీ ఎంపీపీ చిట్ల జయశ్రీ, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మి, కొండబోయిన కిరణ్‌కుమార్, దిండిగ మహేశ్, గువ్వల రవి, కందుర్తి సోమిరెడ్డి, రావుల తిరుమల్‌రెడ్డి, ఉడుగుల భాగ్యలక్ష్మి, యాదగిరి పాల్గొన్నారు.



జనగామలో మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి





ములుగులో కేక్ కట్ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, హనుమకొండలో రక్తదానం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు, చిత్రంలో దాస్యం

**రేవంత్‌వి తుపాకీ వెంకట్రాముడి మాటలు** – దయాకర్‌రావు, మాజీ మంత్రి

అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలు ఇచ్చింది. ఒక్క ఫ్రీ బస్సుతో సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు కొట్లాట పెట్టిండు. వారికి నెలకు రూ.2,500 ఇచ్చాడా? పింఛన్లు పెంచాడా? సీఎం రేవంత్‌రెడ్డి వెనకటికి ఊర్లలో తిరిగే తుపాకీ వెంకట్రాముడిలా మాట్లా డుతున్నాడు. తెలంగాణ రాకముందు మహిళల పరిస్థితి ఎలా ఉండేది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మార్పును ఎవరు తీసుకొచ్చారో ఒక్కసారి ఆలోచించాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను చేయించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. గతంలో కాంగ్రెస్ హయాంలో ఈ పరిస్థితి ఉండేదా? మహిళలు ఆలోచన చేయాలి. కుట్టుమిషన్లు అందుకున్న మహిళలకు హాస్టళ్ల నుంచి బట్టలు కుట్టే ఆర్డర్లు ఇప్పించే బాధ్యతను తీసుకుంటా. ఇందు కోసం కలెక్టర్‌తో మాట్లాడుతా.

**ఆడబిడ్డలు ఎవరిపైనా ఆధారపడొద్దు..** – పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ

మహిళలు ఎవరిపై ఆధారపడకుండా తమ కాళ్లపై తాము నిలబడేందుకే వెయ్యి మందికి కుట్టుమిషన్లు అందించా. పోచంపల్లి ఫౌండేషన్ ద్వారా దశల వారీగా 10వేల మందికి అందించాలని నిర్ణయించా. వారికి చేతినిండా పని కల్పించి నెలకు రూ.20వేల సంపాదన వచ్చేలా బాధ్యత తీసుకుంటా. సంస్థ ఇప్పటికే 1.50 లక్షల మందికి శిక్షణ ఇచ్చింది. దీని ఆధ్వర్యంలో నిర్వహించే కేంద్రాల్లో ట్రెయినర్లుగా ఇక్కడి మహిళలకు ఉద్యోగ అవ కాశాలు లభిస్తాయి. ఒకే మండలానికి చెందిన వెయ్యి మంది మహిళలు సంఘటిత శక్తిగా ఉంటే రానున్న ఎన్నికల్లో రిజర్వేషన్లు కలిసివస్తే మీలో ఒకరు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, ప్రజాప్రతి నిధులు అయ్యే అవకాశాన్ని కల్పిస్తాం. కేటీఆర్‌కు మీ అందరి ఆశీస్సులు ఉండాలి.. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని దీవించాలి.



హనుమకొండలోని ఏషియన్ శ్రీదేవి మాల్‌లో కల్కి సినిమాలోని బుజ్జి కారు

## నగరంలో కల్కి బుజ్జి

హనుమకొండ చౌరస్తా, జూలై 24 : నగరంలో 'కల్కి 2898 ఏడీ' సినిమాలో హీరో ప్రభాస్ వినియోగించిన బుజ్జి కారు సందడి చేసింది. హనుమకొండలోని శ్రీదేవి ఏషియన్ మాల్‌లో బుధవారం కారును ప్రదర్శించారు. ప్రభాస్ ఫ్యాన్స్, నగరవాసులు పిల్లలు సహా కారును చూసేందుకు ఆసక్తి చూపించారు. ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు. బౌన్సర్లను నియమించి కారు చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేయడంతో కారు చూసేందుకు వచ్చినవారు నిరుత్సాహంగా బయటి నుంచే ఫొటోలు దిగి వెళ్లిపోయారు. 'కారు ఎందుకు తీసుకువచ్చారు.. పనిలేకనా, మేం డబ్బులు ఖర్చుచేసి సినిమా చూస్తేనే కదా సినిమా హిట్ అయ్యేది.. మమ్మల్ని కారు వద్ద ఫొటోలు దిగనివ్వరా? అంటూ ఫ్యాన్స్, ప్రజలు గొడవకు దిగారు.

## 53 మంది పోలీసు సిబ్బంది బదిలీ

సుబేదారి, జూలై 24 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 53మంది పోలీసు సిబ్బంది బదిలీ అయ్యారు. బుధవారం సీపీ అంబర్ కిశోర్ ఝా ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ అయిన వారిలో నలుగురు కానిస్టేబుళ్లు, 40 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 13 మంది ఏఎస్సైలు ఉన్నారు. వీరిని కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసుకున్న పోలీసు స్టేషన్లకు సీపీ బదిలీ చేశారు.

# కేంద్రంపై కన్నెర్ర..

*బడ్జెట్‌లో తెలంగాణకు గుండు సున్నాపై ఆగ్రహం*

- తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారంటూ ధ్వజం
- బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు
- నల్లబ్యాడ్జీలతో నిరసన, ప్రధాని మోదీ, కేంద్రం దిష్టిబొమ్మల దహనాలు

నమస్తే నెట్‌వర్క్, జూలై 24: పార్లమెంటులో మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ ఖానాపురం మండలం ధర్మరావుపేటలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మేకల కుమారస్వామి ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పార్టీలకు ఓట్లేసి గెలిపిస్తే రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతున్నా నోరు మూసుకుని చూస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎంపీలను గెలిపిస్తే కేంద్రంతో కొట్లాడైనా నిధులను సాధించుకునేవారని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు నిధులు సాధించుకునే వరకు కేంద్రంతో కొట్లాడాలన్నారు. కార్యక్రమంలో పెరుమాండ్ల సత్యం, పోతరాజు కర్ణాకర్, సమ్మయ్య, అశోక్, తిరుపతి, రామకోటి, మల్లారెడ్డి, సంపత్, కృష్ణ, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా భూపాలపల్లి, మహబూబాబాద్, కేసముద్రం, గార్ల, తొర్రూరు, భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, వరంగల్ నగరంలోని శివనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి, తదితర చోట్ల సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ భూపాల పల్లి పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్ కుమార్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు విజయ్ సారథి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఓమ భిక్షపతి, మండల కార్యదర్శి బందు మహేందర్, రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. హనుమకొండలోని సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో, పరకాలలో కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆత్మకూరులో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దహనం చేసి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సంగెం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ ను దహనం చేశారు.





మానుకోటలో కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు, ఖానాపురంలో బీఆర్ఎస్ నాయకుల నిరసన

## • చలో కాళేశ్వరం

- రేపు అన్నారం, మేడిగడ్డ బరాజ్‌లకు రానున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం
- ప్రాజెక్టు నిజానిజాలు, కాంగ్రెస్ కుట్రలను వివరించనున్న ప్రజాప్రతినిధులు



మేడిగడ్డ బరాజ్

జయశంకర్ భూపాలపల్లి, జూలై 24 (నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టుకు శుక్రవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం రానున్నది. ప్రాజెక్టులో భాగమైన అన్నారం, మేడిగడ్డ బరాజ్‌లను సందర్శించనున్నది. కాంగ్రెస్ పార్టీ ఆది నుంచి ప్రాజెక్టును బదనాం చేయడమే లక్ష్యంగా పెట్టుకొని, రిపేరు చేసే వీలున్నా జాప్యం చేయడంపై బీఆర్ఎస్ ఎప్పటికప్పుడూ ఎండగడుతూనే ఉన్నది. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుంగిన మేడిగడ్డ పిల్లర్ వద్దకు తరలివచ్చింది. సీఎం సహా మంత్రులు వచ్చి బరాజ్ వైఫల్యం అంటూ ఆరోపణలకు దిగారు. ఆ తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు మేడిగడ్డకు వెళ్లి ప్రాజెక్టుకు సంబంధించి నిజానిజాలు, కాంగ్రెస్ కుట్రలను ప్రజలకు వివరించారు. కాగా కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని పూర్తిగా గేట్లు ఎత్తి కిందికి పంపడంతో రైతులు సాగునీటి కోసం పడిన ఇబ్బందులు ప్రాజెక్టు ఆవశ్యకతను గుర్తుచేశాయి. ఇదిలా ఉండగా ప్రస్తుతం అన్నారం, మేడిగడ్డ బరాజ్‌ల నుంచి పెద్ద ఎత్తున నీరు వృథాగా పోతుండడంతో బరాజ్‌ల నుంచి నీటిని పంపింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పంపింగ్ చేయకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం కాళేశ్వరం బాట పడుతున్నది. ఈ నెల 26న ఉదయం ప్రత్యేక బస్సులో బయల్దేరి కన్నెపల్లి పంప్ హౌస్‌కు చేరుకుంటారు. అక్కడినుంచి మేడిగడ్డ బరాజ్‌కు చేరుకుని బరాజ్‌ను సందర్శించి ప్రాజెక్టు గురించి ప్రజలకు వివరిస్తారు.

# చెప్పిందెంత.. చేసిందెంత?

- రుణమాఫీపై రైతులను మోసం చేసిన కాంగ్రెస్ సర్కారు
- కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుంది
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర/దేవరుప్పుల, జూలై24: రుణమాఫీపై కాంగ్రెస్ చెప్పిందెంత.. రేవంత్ రెడ్డి సర్కారు చేసిందెంత అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. ఎన్నికల్లో ఆ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వానకాలానికి ఎకరానికి రూ.7500 చొప్పున రైతు భరోసా కింద ఇవ్వాల్సిన రూ.11,250 కోట్లు ఎగ్గొట్టి అందులోంచి రుణమాఫీ కింద రూ. 6098 కోట్లు విదిల్చి ఏదో ఘనకార్యం చేసినట్టు ప్రచారం చేసుకుంటుందని దుయ్యబట్టారు. బుధవారం పెద్దవంగర, దేవరుప్పుల మండలాల్లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 9న చేయాల్సిన రూ.2లక్షల రుణమాఫీని ఏడు నెలలు ఆలస్యం చేసి రైతులకు రూ.31 వేల కోట్లు రుణమాఫీ అని గొప్పలు చెప్పుకొని తీరా రూ. 6వేల కోట్లు మాఫీ చేసి కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసిందన్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఆ పార్టీ పరిస్థితి ఉందని విమర్శించారు. కేసీఆర్ ఏమి చేయలేదని అంతా తామే చేస్తున్నామనే భ్రమల నుంచి కాంగ్రెస్ సర్కారు బయటకు రావాలని సూచించారు. రైతు సంక్షేమం కోసం ప్రపంచంలోనే ఏ రాజకీయ నేత చేయని కార్యక్రమాలు కేసీఆర్ చేసి చూపించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఇంత వరకు రైతు భరోసా ఎందుకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌలు రైతులకు ఇస్తామన్న రూ. 15వేలు ఏమైనయ్.. రైతు కూలీలకు రూ.12 వేలు ఇంకా అమలు చేయలేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు అమలు కాలేదన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసిన ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారన్నారు. బీఆర్ఎస్‌కు పూర్వవైభవం వస్తుందని, పార్టీ తిరిగి పుంజుకుంటుందని, సమస్యలపై పోరాడుదాం, కొట్లాడుదామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, ఆలయ మాజీ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, నాయకులు సుధీర్‌కుమార్, వెంకట్రామయ్య, రఘు, వెంకన్న, పూల్ సింగ్, బాలు, యాకన్న, రవి, షర్ఫుద్దీన్, భిక్షపతి ఉన్నారు.